# సీఎం సార్.. మీకు సాయపడ్డా.. రుణమాఫీ చేసి ఆదుకోండి

- పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు ట్రాక్టర్‌లో ట్రిపుల్ ఐటీకి తీసుకెళ్లిన రైతు సిందే ఫీరాజీ


ఫీరాజీ ట్రాక్టర్‌లో వెళ్తున్న రేవంత్‌రెడ్డి (ఫైల్)

బాసర, డిసెంబర్ 12 : గతంలో బాసర ట్రిపుల్ ఐటీలో జరిగిన ఓ ఘటన నేపథ్యంలో అప్పట్లో విద్యార్థులు ఆందోళనకు దిగారు. పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి ట్రిపుల్ ఐటీలోకి వెళ్లేందుకు అప్పట్లో ఓ రైతు సాయపడ్డాడు. ఇప్పుడు తనకు రుణమాఫీ చేసి ఆదుకోవాలని ఆ రైతు రేవంత్‌రెడ్డిని వేడుకున్నాడు. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. గతంలో రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు ఓ ఘటనపై ఆందోళన చేస్తున్నారు. ట్రిపుల్ ఐటీలోకి ప్రవేశం లేక పోవడంతో భవనం వెనుక భాగం నుంచి రేవంత్ లోపలికి ప్రవేశించారు. అయితే ట్రిపుల్ ఐటీ వెనుక భాగానికి చేరుకునేందుకు బాసర మండలంలోని లాబ్ధి గ్రామానికి చెందిన రైతు సిందే ఫీరాజీ తన ట్రాక్టర్‌లో రేవంత్‌రెడ్డిని తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రైతు రుణమాఫీ ప్రకటించారు. ఫీరాజీ తల్లి సిందె జీజాబాయి పేరిట ఉన్న రుణం మాఫీ కాలేదు. ఆమె పేరిట రూ.2.25 లక్షలు ఉన్నది. బ్యాంకు అధికారుల సూచన మేరకు రూ.25 వేలు కట్టాడు. అయినా తమకు రుణమాఫీ కాలేదని ఫీరాజీ పేర్కొన్నారు. 'అప్పుడు మీకు సహాయం చేశా, ఇప్పుడు మా రుణాన్ని మాఫీ చేసి ఆదుకోవాలి' అంటూ ఫీరాజీ వీడియో ద్వారా రేవంత్‌రెడ్డిని కోరాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

# 50% ధాన్యమూ కొనలె

> మొదటిపేజీ తరువాయి...

ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందంటూ తొలుత పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన ప్రకటన ఆచరణలో విఫలమైంది.

### సర్కారు నిర్లక్ష్యం.. తగ్గిన కొనుగోళ్లు

ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని చేరుకోకపోవడానికి ప్రభుత్వం, పౌరసరఫరాల సంస్థల నిర్లక్ష్యమే కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొనుగోళ్లు ఆలస్యం చేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని భావిస్తున్నారు. అక్టోబర్ 1 నుంచే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, నవంబర్ వరకూ కొనుగోళ్ల ప్రక్రియ గాడిన పడలేదు. మిల్లర్లకూ. ప్రభుత్వానికి మధ్య ఏర్పడిన పంచాయితీ చాలారోజులపాటు ఎటూ తేలకపోవడంతో ఆదిలోనే కొనుగోళ్లు నిలిచిపోయాయి. బ్యాంకు గ్యారెంటీలు, సన్న ధాన్యం నిబంధనలపై అసంతృప్తితో ఉన్న మిల్లర్లు చివరి వరకు ధాన్యం దించుకోకుండా నిరాకరించారు. దీంతో కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం ఎక్కడ దించాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై అపనమ్మకంతో చాలామంది రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు, మిల్లర్లకు అమ్మేసుకున్నారు. మద్దతు ధర దక్కకపోయినా ప్రైవేటుకు విక్రయించేందుకే మొగ్గు చూపారు. ఇప్పటికే సుమారు 30 లక్షల టన్నులకుపైగా ధాన్యాన్ని రైతులు ప్రైవేటులో విక్రయించినట్టు సమాచారం. ప్రభుత్వం వేగంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టి ఉంటే ప్రైవేటుకు విక్రయించిన ధాన్యం ప్రభుత్వానికే వచ్చేదని, రైతులకు మద్దతు ధర దొరికేదనే అభిప్రాయాలు ఉన్నాయి.

### సన్న ధాన్యం అంతంతే

సన్న ధాన్యం కొనుగోళ్లోనూ అదే పరిస్థితి. తొలుత 50 లక్షల టన్నుల సన్నాలు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు 14 లక్షల టన్నులే కొనుగోలు చేసింది. రూ.500 బోనస్ భారాన్ని తగ్గించుకునేందుకే సన్న ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహించిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం కొర్రీలు పెట్టకుండా సన్న ధాన్యం కొనుగోలు చేసి ఉంటే, ఇప్పటికే 25-30 లక్షల టన్నుల ధాన్యం సర్కారు కేంద్రాలకు వచ్చేదని అంటున్నారు. ఇదంతా ప్రైవేట్ వ్యాపారుల గుప్పెట్లోకి వెళ్లిపోయింది.

# చెప్పిందొకటి.. చేసిందొకటి!

- మొదట ఎనిమిది నెలల సూడి బర్రెలు ఇస్తామన్న ఎస్సీ కార్పొరేషన్ అధికారులు
- హర్యానా వెళ్లాక ప్లేట్ ఫిరాయింపు
- 5 నెలల సూడి బర్రెలే ఇస్తామని వెల్లడి
- ఆందోళనలో పాడి రైతులు
- బర్రెలు తీసుకోకుండానే తిరుగుపయనం


హర్యానాలో ఫామ్ వద్ద ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన రైతులు

చందుర్తి, డిసెంబర్ 12 : రాయితీ బర్రెల కోసం ఆశించిన అన్నదాతకు నిరాశే ఎదురైంది. ఎస్సీ కార్పొరేషన్ అధికారుల తీరు సర్వత్రా విమర్శలకు తావిస్తున్నది. 2020-21లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద రెండు బర్రెలు రాయితీపై ఇచ్చేందుకు అర్హులను ఎంపిక చేసింది. ఈ క్రమంలో సిరిసిల్ల ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ఈ నెల 8న చందుర్తి, రుద్రంగి, వేములవాడ రూరల్ మండలాలకు చెందిన 24 మంది లబ్ధిదారులను హర్యానాలోని రోహ్‌తక్ జిల్లా పురాణ డైయిర్ ఫాంకు తీసుకెళ్లారు. మొదట ఎనిమిది నెలల సూడి బర్రెలు ఇస్తామని చెప్పి, అక్కడికి వెళ్లాక ప్లేట్ ఫిరాయించారు. నాలుగు నెలల నుంచి ఐదు నెలల వరకు సూడితో ఉన్న బర్రెలు మాత్రమే ఇస్తానని అక్కడి ఫామ్ నిర్వాహకులు చెప్పడంతో రైతులు నిర్ఘాంతపోయారు. నాలుగు రోజులుగా అక్కడి ఫామ్‌ల చుట్టూ తింపిన అధికారులు చివరకు రిక్త హస్తం చూపారు. ఎనిమిది నెలల పైబడిన సూడి బర్రెలు ఇస్తేనే తీసుకుంటామని రైతులు స్పష్టంచేశారు. ప్రారంభంలో ఒకటి చెప్పి హర్యానాకు వచ్చాక మాట మార్చడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. బర్రెలు తీసుకోకుండానే గురువారం రోహ్‌తకు నుంచి తిరిగి ప్రయాణమయ్యారు.

## రైతు కుటుంబాలకు పరిహారం ఎందుకివ్వలేదు?

- నాలుగు జిల్లాల కలెక్టర్లపై కోర్టు ధిక్కరణ కేసు

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు హామీ ఇచ్చిన గడువులోగా పరిహారం ఎందుకు చెల్లించలేదని నాలుగు జిల్లాల కలెక్టర్లను హైకోర్టు ప్రశ్నించింది. సామాజిక కార్యకర్త కొండల్ రెడ్డి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్లతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. వాదనల తర్వాత హైకోర్టు, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం హనుమంతరావు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, జనగాం కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషాలకు నోటీసులు జారీచేసింది.

### గురుకులాలపై నివేదిక ఇవ్వండి

రాష్ట్రంలోని గురుకులాలు, వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు తీసుకున్న చర్యలపై సమగ్ర వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు ఇచ్చింది. గతంలో ఆదేశించిన మేరకు మౌలిక వసతుల కల్పన అమలు నివేదికను సమర్పించాలని కోరింది.

# రుణమాఫీ జాప్యంపై విచారణ

- రైతుల ధర్నా, గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదుపై కదిలిన యంత్రాంగం
- అలంకానిపేట ఐవోబీలో విచారణ జరిపిన జేడీఏ
- 971 మందికి రుణమాఫీ కాలేదని నిర్ధారణ


అలంకానిపేట బ్యాంకు వద్ద రైతులతో మాట్లాడుతున్న జేడీఏ

నెక్కొండ, డిసెంబర్ 12: రుణమాఫీ కాలేదంటూ రైతులు ఆందోళనకు దిగడంతో అధికారులు దిగివచ్చి విచారణ చేపట్టారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేటలోని ఐవోబీ పరిధిలోని రైతులు తమకు రుణమాఫీ వర్తించలేదని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయడం, గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగంలో కదలిక వచ్చింది. జిల్లా వ్యవసాయాధికారి అనురాధ గురువారం అలంకానిపేట గ్రామంలోని ఐవోబీని సందర్శించి విచారణ చేపట్టారు. అర్హులమైనా పంట రుణాలు మాఫీ కాలేదని ఆగస్టు నెలలో ఓసారి, ఈనెల 9న మరోసారి కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా చేశారు. రుణంమాఫీ కాలేదని అధికార యంత్రాంగం గుర్తించి నివేదికలు పంపినా ఫలితం లేకుండాపోయింది. అలంకానిపేట ఐవోబీ పరిధిలో 1,477 మంది రైతులకు రూ.10.90 కోట్ల రుణాలు మాఫీ కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 506 మంది రైతులకు రూ.3.69 కోట్ల రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. వివిధ సాంకేతిక కారణాలతో 971 మంది రైతులకు ఇంకా మాఫీ కాలేదని జిల్లా వ్యవసాయాధికారి కే అనురాధ గుర్తించారు. ఈ సందర్భంగా జేడీఏ రైతులతో మాట్లాడుతూ.. అలంకానిపేట ఐవోబీ పరిధిలోని పెద్దకొర్పోలు, అలంకానిపేట, బొల్లికొండ గ్రామాలకు చెందిన వారికి రుణాలు మాఫీ కావాల్సి ఉన్నదని అన్నారు.

# పడిపోతున్న సాధారణ ఉష్ణోగ్రతలు

- కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4డిగ్రీలు తగ్గే అవకాశం
- ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంలో బలపడిన వాయుగుండం గురువారం రాత్రి తీరం దాటే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. దీని ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల తక్కువ నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉదయం వేళల్లో పొగమంచు కురుస్తుందని తెలిపింది. ఉత్తరతెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో చలి గాలులు వీస్తాయని వివరించింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో చలిగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. దీంతో ఆయా జిల్లాలకు మూడు రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఆదిలాబాద్ జిల్లా బేలలో అత్యల్పంగా 7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేలాలో అత్యల్పంగా 7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కుమ్రంభీం జిల్లా సిర్పూర్ (యూ)లో 7.3 డిగ్రీలు నమోదైంది.


జనగామ జిల్లా కొడకండ్ల మండలం నర్సింగాపురంలో పొలాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించిన అధికారులు

## ఎట్టకేలకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు

- 'నమస్తే'కు రైతుల కృతజ్ఞతలు

కొడకండ్ల, డిసెంబర్ 12: జనగామ జిల్లా కొడకండ్ల మండలంలోని నర్సింగాపురం గ్రామంలో విద్యుత్తు సిబ్బంది కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'మేం పంటలు వేయాలా? వద్దా?' కథనానికి సంబంధిత విద్యుత్తు అధికారులు స్పందించారు. హుటాహుటిన కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి కొత్తది బిగించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ యాసంగి సాగుపై దృష్టి పెట్టారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ రావడానికి కారణమైన 'నమస్తే'కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## నాలుగు రోజులు 'ధరణి' బంద్

హైదరాబాద్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్ సేవలను నాలుగు రోజలపాటు నిలిపివేస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. డాటా బేస్ వెర్షన్ అప్‌గ్రేడ్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. గురువారం సాయంత్రం 5 గంటలకు మొదలయ్యే పని సోమవారం ఉదయానికి పూర్తయ్యే అవకాశం ఉన్నదని తెలిపింది.ప్రభుత్వం ధరణి పోర్టల్ నిర్వహణను టెర్రాసిస్ సంస్థ నుంచి ఎన్‌ఐసీకి అప్పగించాలని అక్టోబర్‌లో నిర్ణయించింది. నవంబర్ నాటికే టెర్రాసిస్ సంస్థతో ఒప్పందం గడువు ముగిసినా మరో నెలరోజులు పొడిగించారు. డిసెంబర్ 1న ఎన్‌ఐసీకి బాధ్యతలు అప్పగించనున్నట్టు అక్టోబర్‌లో రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు బదిలీ జరుగుతున్నదని, అందుకే నాలుగు రోజలపాటు పోర్టల్ సేవలు నిలిపివేస్తున్నారని చెప్తున్నారు.


